మాదాపూర్ శిల్పారామంలో కళాకారుల నృత్యప్రదర్శనలు

ఉప్పల్ శిల్పారామంలో సెల్ఫీలు తీసుకుంటున్న సందర్శకులు

కళలకు నిలయం.. శిల్పారామం

మాదాపూర్, ఉప్పల్ శిల్పారామంలో ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శనలు

కొండాపూర్, అక్టోబర్ 24 : మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న ఆల్ ఇండియా శారీ మేళ, దసరా ఉత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా మంగళవారం ప్రముఖ కూచిపూడి నృత్య గురువు పావని శ్రీలత శిష్య బృందం హరిత, శ్రీ సంస్కృతది, ప్రవల్లిక, నిగమ, కీర్తన, అన్విత, మరుషిక, మహతి, మనస్విని కొనుమిదే గణపతిని, సరస్వతి స్తుతి, మీనాక్షి పంచరత్న, తీరు తీరు జవరాల, రాజేశ్వరి అష్టకం అంశాలను కూచిపూడి నృత్యరూపకంలో నర్తించిన తీరు ఆద్యాంతం ఆకట్టుకుంది. దసరా ఉత్సవాలు కొనసాగుతున్న తరుణంలో నగరవాసులు అధిక సంఖ్యలో కుటుంబ సమేతంగా విచ్చేసి సందడి చేస్తున్నట్లు శిల్పారామం యాజమాన్యం తెలిపింది. ఆల్ ఇండియా శారీ మేళలో అందుబాటులో ఉంచిన చేనేత, హస్తకళాకారుల ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారన్నారు.

ఉప్పల్ శిల్పారామంలో...

సిటీబ్యూరో, అక్టోబర్ 24 : ఉప్పల్ శిల్పారామంలో కొనసాగుతున్న ఆల్ ఇండియా శారీ మేళ, దసరా ఉత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ప్రసన్నరాణి బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్యప్రదర్శనలు ఎంతగానో ఆలరించాయి. దసరా సెలవుల సందర్భంగా సందర్శకులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో శిల్పారామం సందర్శకులతో కిటకిటలాడింది.

ఉప్పల్ శిల్పారామంలో కళాకారుల నృత్యప్రదర్శనలు

అందం ఆత్మవిశ్వాన్ని పెంచుతుంది

కోకాపేటలో అడ్వాన్స్డ్ గ్రో హెయిర్ ఆసుపత్రి ప్రారంభోత్సవంలో నటి హిమజ

మణికొండ, అక్టోబర్ 24 : నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని గండిపేట ప్రధాన రోడ్డులోని కోకాపేట టర్మినల్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన అధునాతన అడ్వాన్స్డ్ గ్రో హెయిర్ అండ్ గ్లోస్కిన్ క్లినిక్‌ను మంగళవారం ప్రముఖ నటి, బిగ్‌బాస్ ఫేం హిమజతో పాటు డాక్టర్ బీఆర్ ఎన్ పద్మిని, కేర్ ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్ ప్లాస్టిక్ సర్జన్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా హిమజ మాట్లాడుతూ అందం ఆత్మవిశ్వాన్ని మరింత పెంచుతుందన్నారు. మారుతున్న అలవాట్లు, జీవన శైలికి ప్రతి ఒక్కరిలో జుట్టు రాలడం వంటి సమస్యలు పెరిగిపోతున్నాయని తెలిపారు. ఇలాంటి సమస్యలను పరిష్కరించేందుకు చెన్నై ఆధారిత సంస్థ గ్రో హెయిర్ అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకి తీసుకువచ్చిందని చెప్పారు. అడ్వాన్స్డ్ గ్రో హెయిర్ క్లినిక్ మేనేజింగ్ డైరెక్టర్ శరణ్‌వేల్ మాట్లాడుతూ హెయిర్ గ్రోత్ చికిత్సలతో పాటు మైక్రో బ్లేడింగ్, లిప్ మైక్రోపిగ్మెంటేషన్, ఐలాష్ లిఫ్ట్ అండ్ ఎక్స్‌టెన్షన్, లేజర్ థెరపీ వంటి కొన్ని ప్రీమియం సౌందర్య చికిత్సలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మహానగరంలో ఇది నాల్గవ ఆసుపత్రి అని అన్నారు. దేశవ్యాప్తంగా 29 ఆసుపత్రులను కలిగి ఉన్న తమ సంస్థ 2024లో 100 ఆసుపత్రులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్రాంచైజీ భాగస్వాములు లక్ష్మీసౌజన్య, నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

కోకాపేటలో అడ్వాన్స్డ్ గ్రో హెయిర్ అండ్ గ్లోస్కిన్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న బిగ్‌బాస్ ఫేం నటి హిమజ, నిర్వాహకులు

40 ఏండ్లలోపు మహిళల్లో..

25శాతం మందికి రొమ్ము క్యాన్సర్

అపోలో హెల్త్ స్క్రీనింగ్ డేటా ఆధారంగా వెల్లడి

సిటీబ్యూరో, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ) : దేశంలోని 40 ఏండ్లలోపు మహిళలు 25శాతం రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు అపోలో హెల్త్ స్క్రీనింగ్ డేటా ఆధారంగా వెల్లడించింది. గ్లోబల్ మార్గదర్శకాల ప్రకారం 2018 నుంచి 2023వరకు ఐదేండ్ల పాటు పరిశోధించిన వివరాలు వెల్లడించింది. గత ఐదేండ్లలో సుమారు లక్షా 50వేల మంది 40ఏండ్లలోపు మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించగా 25శాతం మంది రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నట్లు రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసాన్ని పురస్కరించుకొని అపోలో హాస్పిటల్ వెల్లడించింది. అపోలో ప్రివెంటివ్ హెల్త్ సీఈవో డాక్టర్ సత్యశ్రీరామ్ మాట్లాడుతూ 40 ఏండ్లు పైబడిన మహిళలకు రెగ్యులర్‌గా బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్‌ను నిర్వహించాలని గ్లోబల్ మార్గదర్శకాలు సూచిస్తున్నట్లు తెలిపారు. అపోలో ప్రోటాన్ క్యాన్సర్ సెంటర్-రొమ్ము క్యాన్సర్ నిపుణురాలు, ఆంకోప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ మంజులరావు మాట్లాడుతూ పశ్చిమ దేశాలతో పోలిస్తే మనదేశంలో రొమ్ము క్యాన్సర్ మరణాలు పెరిగాయని పేర్కొన్నారు. ముందస్తుగా గుర్తిస్తే వ్యాధిని నివారించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు.

ఐకేపీ నాలెడ్జ్ పార్కు ఆధ్వర్యంలో..

30, 31న ఇంటర్నేషనల్ నాలెడ్జ్ మిల్లెనీయం కాన్ఫరెన్స్

సిటీబ్యూరో, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ) : ఐకేపీ నాలెడ్జ్ పార్కు ఆధ్వర్యంలో ఈ నెల 30, 31న ఇంటర్నేషనల్ నాలెడ్జ్ మిల్లెనీయం కాన్ఫరెన్స్‌ను హైదరాబాద్ వేదికగా నిర్వహించనున్నారు. హెచ్ఐసీసీలో జరిగే ఈ సదస్సులో ప్రపంచ పోకడలు, ఆయా అంశాల్లో భారతదేశానికి ఉన్న అవకాశాలపై కీలకమైన భాగస్వాములు, నిపుణులు పాల్గొంటారు. 'సాంకేతిక ఆవిష్కరణలో ప్రపంచ ఔచిత్యం' అనే శాస్త్రీయ అంశంపై ప్రత్యేకంగా చర్చా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఐకేపీ నాలెడ్జ్ ఆధ్వర్యంలో ఉన్న జినోమ్ వ్యాలీ సైన్స్ పార్క్‌గా అభివృద్ధి చేయడంపై ప్రధానంగా చర్చించనున్నారు.

అట్టహాసంగా లా లా ల్యాండ్ సీజన్ 3

మాదాపూర్, అక్టోబర్ 24 : మ్యూజిక్, ఏరోబిక్ డ్యాన్సులతో పాటు కమెడీతో యువత ఉత్సాహంగా గడిపారు. మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన లా లా ల్యాండ్ సిజన్ 3 కార్యక్రమంలో భాగంగా నగర యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాలీవుడ్ బ్యాండ్ అయాజ్ ఖాన్ హాజరై సందడి చేశారు. పెంపుడు కుక్కలను సైతం లా లా ల్యాండ్ సిజన్‌లో భాగస్వామ్యం చేశారు. ఆంధ్ర, తెలంగాణకు చెందిన ప్రత్యేక వంటకాలను అందుబాటులో ఉంచారు. టాప్ బ్రాండెడ్ దుస్తులు, ఎరోబిక్ డ్యాన్సులతో ఎంతో కోలాహలంగా సాగింది.

ఉత్సాహంగా డ్యాన్స్ చేస్తున్న యువత

లా లా ల్యాండ్ సిజన్‌లో భాగస్వామ్యమైన పెట్స్

వందేభారత్‌లో 7.16 లక్షల మంది ప్రయాణం

సిటీబ్యూరో, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ) : దక్షిణ మధ్య జోన్‌లో వందేభారత్ రైళ్లలో ప్రారంభం నుంచి ఇప్పటి వరకు మొత్తం 7.16 లక్షల మంది ప్రయాణం చేసినట్లు మంగళవారం దక్షిణ మధ్య రైల్వే జోనల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. ఎస్ సీఆర్ ఆధ్వర్యంలో అత్యంత వేగవంతమైన ప్రయాణ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. అలాగే యువకులు, వృద్ధులు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాలకు చెందిన వారు అధిక సంఖ్యలో ప్రయాణం చేస్తున్నట్లు పేర్కొన్నారు.